RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి : 13 సంచిక : 251 | గురువారం, ఫిబ్రవరి 19 2026 | ఎడిటర్ : బట్టు లక్ష్మీనారాయణ, | పేజీలు : 6 వెల : రూ. 5.00

Hyderabad, Vijayawada, Vishakapatnam Tirupathi, Ananthapuram,Guntur,Nellor,Ongole,kadapa, Medak, Sangareddy, Siddipet, Nalagonda, Karimnagar,

## దళిత నాయకుడు బాల్క అరెస్టు దుర్మార్గం

- కాంగ్రెస్ అక్రమాలను ఎదిరించినందుకు అరెస్టా
- మండిపడ్డ మాజీమంత్రి హరీష్ రావు



హైదరాబాద్,ఫిబ్రవరి 18 : క్యాతనపల్లిలో కాంగ్రెస్ అప్రజాస్వామిక, అహంకార చర్యల ను అడ్డుకున్నందుకు మాజీ శాసన సభ్యులు, దళిత నాయకుడు బాల్క సుమన్‌ను అరెస్టు చేసి

మిగతా2లో...



2లో

## విద్య, ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం

● యుద్ధ ప్రాతిపదికన హాస్టల్ భవనాల మరమ్మతులు ● సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో అధికారుల నిరంతర పరిశీలన ● లక్ష కోట్లకు పైగా నిధులతో రాష్ట్రంలో రహదారుల నిర్మాణం ● సాంస్కృతిక కార్యక్రమాలు నిరంతరం జరగాలి ● దేశంలో నే మోడల్ గా అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లు ● ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం



## ఎఐ సమ్మిట్ కోసం భారత్‌కు సుందర్ పిచాయ్

### ప్రధాని మోడీతో భేటీ అయినట్లు వెల్లడి

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 18 : సాంకేతిక ప్రపంచంలో భారత్ తన ముద్ర వేస్తోంది. ఇందులో భాగం గా.. గూగుల్, ఆల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్ బుధవారం న్యూఢిల్లీలో భారత ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. ప్రధాని మోదీ–సుందర్ పిచాయ్ మధ్య జరిగిన ఈ సమావేశం ప్రధానంగా కృత్రిమ మేధ, డిజిటల్ మౌలిక సదుపాయాల

మిగతా2లో...

## విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ

● ఐఎన్ఎస్ సుమేధపై ప్రయాణించిన రాష్ట్రపతి ● ముర్ముతో పాటు పాల్గొన్న గవర్నర్, సిఎం, డిప్యూటి సిఎం



విశాఖపట్నం,ఫిబ్రవరి 18 : దేశ తీర ప్రాంత ప్రయోజనాలు కాపాడటంలో నేవీది కీలకపాత్ర అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. సముద్ర వాణిజ్య ంలో సైతం నేవీ సుస్థిరత తీసుకొచ్చిందని పేర్కొన్నారు. విశాఖపట్నం తీరం వేదికగా జరుగుతున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) బుధవారం ప్రారంభమయ్యాయి. బుధవారం ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ముర్ముతోపాటు ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దు ల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొ ని.. ఐఎన్ఎస్ సుమేధపై ప్రయాణించారు. నేవీ సిబ్బంది నుంచి రాష్ట్రపతి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ దేశాల నుంచి వచ్చిన 19 విదేశీ నౌకలు, భారత నేవీకి చెందిన

మిగతా2లో...

## ధరణి దోపిడిపై ఉక్కుపాదం



### తీగలాగితే డొంక కదిలినట్లుగా ధరణి వ్యవహారం

### అక్రమాలపై కఠిన చర్యలు తప్పవు

### కోడ్ ఆడిట్‌కు ఆదేశాలు

### రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి

హైదరాబాద్,ఫిబ్రవరి 18 : తీగ లాగితే డొంక కదిలినట్లుగా ధరణి పోర్టల్ వ్యవహారం ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజల ఆస్తుల రక్షణకు నిర్మించవలసిన వ్యవస్థనే ఆనాటి ప్రభుత్వంలోని కొంతమంది ప్రముఖులు తమ స్వార్ధ ప్రయోజనాల కోసం వాడుకున్నారని మండిపడ్డారు. ధరణి పోర్టల్ లోని లొసుగులను ఆసరాగా చేసుకొని స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలను కొల్లగొట్టిన సంఘటనపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించగా దిగ్భ్రాం÷–రతి కరమైన అనేక కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. ఇది సాధారణ సాంకేతిక లోపం కాదని వ్యవస్థాగతంగా సృష్టించిన లోపాల ఫలితమని స్పష్టం చేశారు. సచివాలయంలోని తన కార్యాలయంలో ఉన్నతస్థాయి కమిటీతో బుధవారం మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆనాడు ధరణి పోర్టల్ సెక్యూరిటీ ఆడిట్ చేసిన సమయంలో గుర్తించిన లోపాలను సరిదిద్దకుండానే అంతా సవ్యంగానే ఉన్నట్లుగా నివేదిక ఇచ్చారని అలాగే మానవ ప్రమేయంతో తప్పులు చేసే విధంగా పోర్టల్ ను రూపొందించారని , భూముల లావాదేవీలకు సంబంధించి అనుమానాస్పదంగా ఉన్న భూముల సమాచారం లభించకుండా లాగిన్‌లు డిలిట్

మిగతా2లో...

## ప్రారంభమైన 4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్

### ముఖ్య అతిథిగా విచ్చేసి పోటీలను ప్రారంభించిన డీజీపీ శివధర్ రెడ్డి

### 33 జిల్లాల నుండి 2,532 మంది క్రీడాకారుల భాగస్వామ్యం



హైదరాబాద్,ఫిబ్రవరి 18 : తెలంగాణ రాష్ట్ర పోలీస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న '4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్–2026' సైబరాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ క్రీడా జ్యోతిని అందించగా, డీజీపీ దానిని వెలిగించి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని క్రీడాకారులు,

మిగతా2లో...

## రంజాన్ మత సామరస్యానికి ప్రతీక

- శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్,18 : పవిత్ర రంజాన్ మాసం ప్రారంభ మైన సందర్భంగా తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ముస్లిం సోదర సోదరీమ ణులకు శు భాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర మాసంలో ముస్లింలు ఆచరించే ఉపవాస దీక్షలు, ప్రార్థనలు ఆధ్యాత్మి కతను పెంపొందించడంతో పాటు క్రమ శిక్షణను పెంచుతాయ న్నారు. లౌకిక వాదం, మత సామరస్య పరిర క్షణలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని సీఎం అన్నారు. ముస్లిం సోదరులు రంజాన్ మాసం సంతోషంగా జరుపుకొని, అల్లా దీవెనలు పొందాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.




## దేశవ్యాప్తంగా 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నిక

● తెలంగాణలో కేఆర్ సురేశ్ రెడ్డి, అభిషేక్ సింఘ్వీల స్థానాలు ఖాళీ ● మార్చి 16న ఎన్నికల నిర్వహణకు ఇసి రంగం సిద్ధం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 18 : దేశవ్యాప్తంగా 37 రాజ్యసభస్థానాలు ఖాళీ కాబోతున్నాయి. ఖాళీ కాబోతున్న రాజ్య సభ సీట్లకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం పది రాష్ట్రా ల్లో సుమారు 37 రాజ్యసభ స్థానాలు ఖాళీ కాబోతున్నా యి. ఆ స్థానాలను భర్తీ చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 16వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నది.

మిగతా2లో...

## పట్టణాభివృద్ధిలో తెలంగాణ దేశానికే ఆదర్శం

● గ్రీన్ ఎనర్జీతోనే విప్లవం ● నెట్ జీరో స్టేట్ గా తెలంగాణ... ● అందుకే క్యూర్, ప్యూర్, రేర్ విభజన

● ముంబయి క్లైమెట్ వీక్ కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి




ముంబయి,ఫిబ్రవరి 18 : గ్రీన్ ఎనర్జీ ప్రపంచ పరిరక్షణకు లాభదాయకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తెలంగాణలో గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో గ్రీన్ ఎనర్జీకి తాము ప్రోత్సాహిస్తున్నట్టు వెల్లడించారు. తెలంగాణ 30 లక్షలకు పైగా పంప్‌సెట్‌లు, దాదాపు 50 లక్షల గృహాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. ఈ శక్తిని బొగ్గు, సాంప్రదాయ ఇంధన వనరుల నుంచి సోలార్, గ్రీన్ ఎనర్జీ వైపు మార్చడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. కాలుష్య నియంత్రణ, రీసైక్లింగ్, స్థిర శక్తి ఉత్పత్తి పద్ధతులపై నిరంతరం పరిశోధనలు కొనసాగిస్తున్నామన్నారు. హైదరాబాద్‌ను 2034 నాటికి నెట్ జీరో నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. పట్టణాభివృద్ధిలో భాగంగా తాము కార్బన్ ఫుట్‌ప్రింట్ ఆడిట్ చేపట్టనున్న తొలి భారత నగరంగా హైదరాబాద్ నిలవబోతుందని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)లో దాదాపు పరిశ్రమలు ఉండవని స్పష్టం చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'క్లైమేట్ వీక్' సదస్సులో రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. బాంద్రా కుర్లా జియో కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఉదయం జరిగిన ఈ సమావేశంలో దేశంలోని పట్టణాలు, నగరాభివృద్ధి, వాతావరణ మార్పులకు అనుగుణ మైన విధానాలపై ముఖ్యమంత్రి తెలంగాణ దృక్పథాన్ని వివరించారు. దేశ పట్టణాభివృద్ధికి సంబంధించిన సదస్సులో మాట్లాడడం తనకు సంతోషంగా ఉందన్నారు. 2047 లక్ష్యాన్ని అర్థం చేసుకోవాలంటే 1947 నుంచి భారత అభివృద్ధి ప్రయాణాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని అన్నారు. స్వాతంత్ర్యం÷–ర అనంతరం తొలి నాలుగు దశాబ్దాల్లో దేశంలో ప్రధాన ప్రాధాన్యతలు విద్యా వ్యవస్థ, నీటిపారుదల రంగాలేనని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాథమిక పాఠశాలల నుంచి ఐఐటి,ఐఐటెం,ఐఐఎస్‌సి వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకున్నామని గుర్తు చేశారు. విద్యుత్,

మిగతా2లో...

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# ధరణి దోపిడిపై ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

చేశారని, అత్యంత రహస్యంగా ఉండవలసిన లాగిన్ వివరాలు లేకుండా పోయాయని ఉన్నత స్థాయి కమిటీ విచారణలో ప్రాధమికంగా గుర్తించడం జరిగిందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన భూలావాదేవీల సమాచారం లభించకుండా చేశారని ,ఫోరెన్సిక్ ఆడిట్‌లో కోడ్ ఆడిట్ నిర్వహించలేదన్న విషయం బహిర్గతమైందని, ఈ నేపథ్యంలో తక్షణమే ధరణి పోర్టల్ పై కోడ్ ఆడిట్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ధరణి పోర్టల్ నిర్వహణా బాధ్యతను టెర్రాసిస్ అనే విదేశీ సంస్థకు అప్పగించడం వల్లే సమస్యలు ఎదురవుతున్నాయని గుర్తించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి సూచనల మేరకు ధరణి లోపాలను అడ్డుపెట్టుకొని ప్రభుత్వానికి రావలసిన స్టాంప్‌డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలను కొల్లగొట్టిన వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తా మని, తప్పుచేసినవారు ఎవరినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ప్రభుత్వానికి రావలసిన ప్రతిపైసాను వసూలు చేస్తామన్నారు. దీనిపై ఉన్నత స్థాయి కమిటీ ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకొని భవిష్యత్తులో అలాంటి పొరపాట్లు జరగకుండా ఏ చిన్న లోపానికి తావులేకుండా అధికారుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా ప్రజలకు ఫ్రెండ్లీగా ఉండేలా భూభారతి పోర్టల్ ను నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రజల భూముల విషయంలో ఎటువంటి రాజీ పడబోమని, ధరణి పేరుతో జరిగిన ప్రతి అక్రమాన్ని వెలికితీస్తామని, సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో నిర్వహించిన విధంగానే మిగిలిన జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ , సిఎం ఆర్ వో మందా మకరంద్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంత్, ఉన్నత స్థాయి కమిటీ సభ్యులు స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ డిఐజి సుభాష్, ఎస్‌బి ఎస్పీ సింధు శర్మ, సైబర్‌క్రైమ్ డిఎస్పీ ఎ. సంపత్, హోంశాఖ సలహాదారు పి. శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టణాభివృద్ధిలో తెలంగాణ దేశానికే ఆదర్శం

(మొదటి పేజీ తరువాయి)

సాగునీటికి భారీ ఆనకట్టలను నిర్మించి రైతుల పొలాలను నీటితో అనుసంధానించామని తెలిపారు. 1990 నాటికి భారత్ ఆహార కొరత నుంచి ఆహార భద్రత సాధించిందని చెప్పారు. దీంతో ప్రజల జీవిత కాలం పెరిగిందని ముఖ్యమంత్రి అన్నారు. దేశంలోని ఇంజినీర్లు, వైద్యులు, శాస్త్రవేత్తలు ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమంగా గుర్తింపు పొందే విధంగా అభివృద్ధి సాధించిందని వివరించారు. 1991 నుంచి 2020 వరకు లిబరలైజేషన్, ప్రయివేటైజేషన్, గ్లోబలైజేషన్ సంస్కరణలతో భారత్ సేవా రంగంలో శక్తివంతమైన దేశంగా ఎదిగిందని సీఎం వివరించారు. టెలికాం , సాఫ్ట్ వేర్ విప్లవంతో పట్టణ మౌలిక సదుపాయాల విస్తరణ సాధ్యమైందని అన్నారు. భారత నిపుణులు సిలికాన్ వ్యాలీ వంటి ప్రపంచ కేంద్రాల్లో విజయాలు సాధించారని తెలిపారు. 1991 తర్వాత గ్లోబల్ సాఫ్ట్ వేర్, టెక్ సంస్థలు తమ బ్యాక్ ఆఫీస్ కార్యకలాపాలకు భారత్‌ను ఎంచుకున్నాయని అన్నారు. అందుకే ప్రపంచంలో అత్యధిక గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు మన దేశంలో ఉన్నాయన్నారు. అయితే, ఈ టెక్ పురోగతిలో తయారీ రంగం ఎక్కువగా అవకాశాలు కోల్పోయినట్లు అభిప్రాయపడ్డారు. కోవిడ్ అనంతరం ప్రభుత్వాల దృష్టికోణం మారిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం అభివృద్ధి వ్యూహంలో తయారీ రంగం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిరత్వం కీలకంగా మారాయని అన్నారు. ఏ ఆర్థిక వ్యవస్థకైనా విద్యుత్ ఉత్పాదక వనరులే అసలైన కరెన్సీ అన్నారు. విద్యుత్ ఉత్పత్తి, వినియోగం అభివృద్ధికి కొలమానంగా నిలుస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను ప్రస్తావిస్తూ, రాష్ట్ర జీడీపీని 200 బిలియన్ డాలర్ల స్థాయి నుంచి 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడం లక్ష్యమని తెలిపారు. భవిష్యత్ అభివృద్ధికి ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, విద్య, నైపుణ్యాలు, వనరులు, ఉపాధి ప్రధాన స్తంభాలుగా నిలుస్తాయని అన్నారు. రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధికి తెలంగాణను క్యూర్,ఫ్యూర్, రేర్ జోన్‌లుగా విభజించినట్లు ముఖ్యమంత్రి వివరించారు. హైదరాబాద్‌ను 160 కి.మీ. పొడవైన ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో కోర్ అర్బన్ రీజియన్ ఏకానమీగా ప్రకటించగా, 360 కి.మీ.ల రీజినల్ రింగ్ రోడ్ మధ్య ప్రాంతాన్ని ప్యూర్ జోన్‌గా రూపొందించి తయారీ రంగానికి నిర్దేశించినట్లు చెప్పారు. ఈ ప్రాంతాన్ని దేశంలోనే అతిపెద్ద తయారీ కేంద్రంగా అభివృద్ధి చేసి చైనా ప్లస్ 1 కు ప్రత్యామ్నాయంగా తెలంగాణను నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ తయారీ వృద్ధి గ్రీన్ ఎనర్జీ ఆధారంగా సాగుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ విద్యుత్ వినియోగంపై ముఖ్యమంత్రి గణాంకాలను వెల్లడించారు. హైదరాబాద్ మెట్రోను ప్రస్తుత 71 కి.మీ. నుంచి 200 కి.మీ. పైగా విస్తరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. పరిశ్రమలను కోర్ అర్బన్ ప్రాంతం నుంచి పెరి అర్బన్ జోన్‌లకు తరలిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగంగా మూసీ నది పునరుద్ధరణ, సరస్సులు, చెరువుల సంరక్షణ, వాటర్ గ్రిడ్, వనరుల నిర్వహణ ప్రణాళికలను ముఖ్యమంత్రి వివరించారు. హైడ్రా రూపంలో పర్యావరణ రక్షణకు ప్రత్యేక పోలీసు దళాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో వాతావరణ ప్రమాదాలను తగ్గించి నగరాన్ని సురక్షితమైన, వేగంగా అభివృద్ధి చెందే నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. తెలంగాణను మొత్తం దేశానికి ఆదర్శంగా నిలబెట్టడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

# విద్య, ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం

**హైదరాబాద్,ఫిబ్రవరి 18:** రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని, ఈ రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఎన్ని నిధులైన ఖర్చు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెనుకాడబోదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో మైనారిటీ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, రోడ్డు రవాణా, నీటిపారుదల శాఖ, సివిల్ సప్లయిస్, రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల బ్జడెట్ సమావేశాలు జరిగాయి. సమావేశాల్లో మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అజారు ద్దీన్ లతో కలిసి డిప్యూటీ సీఎం ప్రీ బ్జడెట్ సమావేశాలు నిర్వహించారు. మంత్రి అజారుద్దీన్ తో కలిసి మైనార్టీ సంక్షేమ శాఖ సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఆలోచించి, నిబద్ధతతో ప్రాధాన్యతను గుర్తించి, ఆదాయం ఖర్చుపై దృష్టి సారించి బ్జడెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. సంక్షేమ శాఖకు సంబంధించి వసతి గృహాలు, గురుకులాల బిల్లులు ఎంత తొందరగా పంపితే అంత తొందరగా క్లియర్ చేస్తామని, వసతి గృహాల భవనాల మరమ్మత్తులు వేగంగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని అన్ని వర్గాల విద్యార్థులు ఉమ్మడి కుటుంబం లా కలిసిపోవడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. విద్యార్థులు, టీచింగ్ స్టాఫ్ కు బయోమెట్రిక్ విధానం లేకపోతే వెంటనే అమలులోకి తీసుకు రావాలని వాటిని కంట్రోల్ రూమ్ కు అను సంధానం చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ బిల్డింగ్ ల పైన సోలార్ పవర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ తో సమావేశమై ఏర్పాటు చేసుకోవాలని కరెంటు భారం లేకుండా చేసుకోవడమే కాదు, సోలార్ ద్వారా ఆదాయం సృష్టించుకోవచ్చని తెలిపారు. వసతి గృహాలు, సంక్షేమ హాస్టళ్లకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాం కొత్త మెనూ అమల్లోకి తీసుకు వచ్చాం, వసతి గృహాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం వి నేపథ్యంలో జిల్లా అధికారులు, రాష్ట్రస్థాయి అధికారులు వసతి గృహాలను సందర్శించి అన్ని విషయాలను పరిశీలించాలని వీలైతే ఒక రోజు రాత్రి అక్కడే బస చేయాలని గతంలోనే ఆదేశించాం, ఆ పక్రియ ఎంత మేరకు కొనసాగుతుందో సెక్రటరీలు ఆయా జిల్లా కలెక్టర్ల ద్వారా పర్యవేక్షణ జరపాలని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి వసతి గృహాల అద్దెలను క్లియర్ చేస్తున్నామని తెలిపారు. హాస్టల్ బిల్డింగుల మరమ్మతు బిల్లులు ఉంటే వెంటనే పంపాలని వెనువెంటనే క్లియర్ చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. వరి సాగు పెద్ద ఎత్తున చేయడం, బాయిల్డ్ రైస్ ను తమిళనాడు వంటి రాష్ట్రాలు కొనుగోలు చేసే పరిస్థితి లేకపోవడం నేపథ్యంలో భవిష్యత్తులో రాష్ట్ర రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉన్న నేపథ్యంలో పంట మార్పిడికి అవకాశాలను పరిశీలించాలని నీటిపారుదల శాఖ సమావేశంలో మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి సూచించారు. వరి స్థానంలో పామ్ ఆయిల్, పప్పు ధాన్యాలు సాగు చేస్తూ, పంట నిలువల స్టోరీ ఈ సామర్థ్యాన్ని రాష్ట్రంలో పెంచాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రభుత్వం బీసీ లకు బ్జడెట్‌లో ప్రాధాన్యత కల్పిస్తుంది.

# 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్య సాధనలో కీలకంగా లైఫ్ సైన్సెస్

**దేశ జీడీపీలో మన వాటాను 10 శాతానికి పెంచేందుకే**

**తెలంగాణ రైజింగ్ 2047'కు శ్రీకారం**

**బయో ఏషియా 2026 ముగింపు వేడుకలో మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్,ఫిబ్రవరి 18:** తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ పవర్‌హౌస్‌గా మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని, ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. లైఫ్ సైన్సెస్ రంగంలో కేవలం రెండేళ్లలోనే రూ. 73,360 కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, లక్ష ఉద్యోగాలను సృష్టించామని వివరించారు. బుధవారం హైటెక్స్ లో 'బయో ఏషియా 2026' సదస్సులో భాగంగా 'తెలంగాణ రైజింగ్ 2047: బిల్డింగ్ ఏ వరల్డ్ క్లాస్ లైఫ్ సైన్సెస్ ఎకో సిస్టం' పేరిట నిర్వహించిన ముగింపు వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలనే లక్ష్యంతోనే ప్రజలు, నిపుణుల భాగస్వా మ్యంతో 'తెలంగాణ రైజింగ్ 2047'కు శ్రీకారం చుట్టామన్నారు. 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలనే లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషించేలా లైఫ్ సైన్సెస్ రంగం ఎకో సిస్టంను మరింత బలోపేతం చేసేందుకు




సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నా మన్నారు. అందులో భాగంగానే.... తెలంగాణ నెక్స్ట్ - జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ తెలంగాణ లైఫ్ సైన్సెస్ స్కూల్, 1బయో ఇంక్యూబేటర్, జీనోమ్ వ్యాలీ విస్తరణ, ఫార్మా విలేజెస్, తెలంగాణ లైఫ్ సైన్సెస్‌ను మరింత బలోపేతం చేసేందుకుప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ భాగస్వామ్యం, నైపుణ్యం కలిగిన మానవ వనరుల తయారీకి శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 2,000కు పైగా లైఫ్ సైన్సెస్ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, జాతీయ ఫార్మా ఉత్పత్తుల్లో మూడో వంతు, ఎగుమతుల్లో అయిదో వంతు వాటా తెలంగాణదే కావడం మనకు గర్వకారణమన్నారు. ఈ ఏడాది సదస్సులో సనోఫీ, ఒపెల్లా , వ్యాక్సిండో యానిమల్ హెల్త్, ట్రెడెన్స్, ఆర్‌ఎక్స్ ప్రొపె÷-లలెంట్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు ముందుకొచ్చాయన్నారు. బ్రిటన్, న్యూజిలాండ్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, జపాన్, యూకే తదితర దేశాల నిపుణులతో లైఫ్ సైన్సెస్ రంగంలో రాబోయే రోజుల్లో ఎదురయ్యే సవాళ్లు, అనుసరించాల్సిన వ్యూహాలపై నిర్వహించిన ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశాలు తెలంగాణ బ్రాండ్ ను మరింత విశ్వవ్యాప్తం అయ్యేందుకు దోహదం చేస్తాయన్నారు. 'బయో ఎకానమీ' రంగంలో మూడో అతిపెద్ద శక్తిగా ఎదగడానికి భారత్ కు ఉన్న అవకాశాలు, తెలంగాణ పాత్రపై చర్చించి... ప్రత్యేక కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్ ను సిద్ధం చేసేందుకు వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌తో కలిసి ప్రత్యేక చర్చా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈసారి ఫార్చ్యూన్ 500 కంపెనీల ప్రతినిధులతో పాటు దేశ విదేశాల నుంచి మొత్తం 4,394 మంది ప్రతినిధులు హాజరయ్యారన్నారు. కొత్త పెట్టుబడులు, భాగస్వామ్యాల కోసం 4వేలకు పైగా అత్యున్నత స్థాయి బిజినెస్ టూ బిజినెస్ సమావేశాలకు ఈ ఏడాది సదస్సు వేదికగా నిలిచిందన్నారు. లైఫ్ సైన్సెస్ రంగాన్ని తమ ప్రభుత్వం కేవలం వ్యాపారంగా మాత్రమే చూడటం లేదని, ఒక సామాజిక బాధ్యతగా చూస్తున్నామన్నారు. అన్ని రకాలుగా పారిశ్రామికాభివృద్ధికి అనుకూలంగా ఉన్న రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి రైజింగ్ తెలంగాణలో భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు.

# దేశవ్యాప్తంగా 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల సంఘం షెడ్యూల్ వివరాలను విడుదల చేసింది.తెలంగాణ నుంచి కేఆర్ సురేశ్ రెడ్డి, డాక్టర్ అభిషేక్ మను సింఘ్వీ స్థానాలు ఖాళీ కానున్నాయి. ఏప్రిల్ 9వ తేదీన ఆ ఇద్దరి పదవీకాలం ముగియనున్నది. ఇక మహారాష్ట్ర నుంచి అత్యధికంగా ఏడు మంది రాజ్యసభ ఎంపీలు తమ పదవీ కాలాన్ని ఏప్రిల్ 2వ తేదీన పూర్తి చేసుకోనున్నారు. దీంతో ఆ రాష్ట్రానికి చెందిన ఆ ఏడు స్థానాలకు కూడా ఎన్నికలు నిర్వహించనున్నారు. ఒడిశాలో నలుగురు , తమిళనాడులో ఆరుగురు, బెంగాల్‌లో అయిదుగురు, అస్సాంలో ముగ్గురు , బీహార్‌లో అయిదుగురు, చత్తీస్‌ఘడ్, హర్యానాల్లో ఇద్దరేసి, హిమాచల్ ప్రదేశ్‌లో ఒకరి సీటు కోసం ఎన్నికలు నిర్వహించనున్నారు. 37 మంది రాజ్యసభ సభ్యులు ఏప్రిల్‌లో రిటైర్ కానున్నారని, వారి స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నది. ఎన్నికల షెడ్యూల్‌కు చెందిన నోటిఫికేషన్ ఫిబ్రవరి 26వ తేదీన రిలీజ్ చేయనున్నారు. మార్చి 5 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. మార్చి 9వ వరకు దరఖాస్తులు విత్‌డ్రా చేసుకోవచ్చు. 16వ తేదీన ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు ఓటింగ్ జరుగుతుంది. ఆ రోజే సాయంత్రం 6 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు పక్రియ ఉంటుంది.

# విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ

(మొదటి పేజీ తరువాయి)

45 నౌకలు, కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధనా నౌకలు 9 ఫ్లీట్ రివ్యూలో పాల్గొన్నారు. ఆరు వరుసల్లో 71 యుద్ధ నౌకలు పరేడ్ నిర్వహించాయి. విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ కొనసాగుతోంది. ఆరు వరుసల్లో 71 యుద్ధ నౌకలు పరేడ్ నిర్వహించాయి. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేరుగా వీక్షించారు. నేవీ సిబ్బంది నుంచి రాష్ట్రపతి గౌరవ వందనం స్వీకరించారు. ఐఎన్‌ఎస్ సుమేధ నౌకపై రాష్ట్రపతితో పాటు గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం ప్రయాణిం చారు. రష్యా, ఆస్ట్రేలియా, యూఏఈ.. తదితర దేశాల నుంచి వచ్చిన 19 విదేశీ నౌకలు, భారత నేవీకి చెందిన 45 నౌకలు, కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధన నౌకలు 7 ఫ్లీట్ రివ్యూలో పాల్గొన్నాయి.

# ఎఐ సమ్మిట్ కోసం భారత్‌కు సుందర్ పిచాయ్

(మొదటి పేజీ తరువాయి)

చుట్టూ సాగినట్లు సమాచారం. భారత్‌లో జరుగుతున్న ప్రతిష్టాత్మక 'ఇండియా ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026'లో పాల్గొనేందుకు ఆయన భారత్‌కు చేరుకున్నారు. సుందర్ పిచాయ్ ఈ శిఖరాగ్ర సమావేశంలో 20న కీలక ప్రసంగం చేయనున్నారు. ఈ సందర్భంగా సుందర్ పిచాయ్ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. 'ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ కోసం భారత దేశానికి తిరిగి రావడం ఆనందంగా ఉంది. ఎప్పటిలాగే చాలా మంది మనస్ఫూర్తిగా స్వాగతం పలుకుతున్నారు' అంటూ రాసుకొచ్చారు. ఈ సదస్సులో 110కి పైగా దేశాలు, 30 అంతర్జాతీయ సంస్థలు పాల్గొంటున్నాయి.

# పారంభమైన 4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు కలిసి ఆలపించగా మైదానమంతా రాష్ట్ర స్ఫూర్తితో మారుమోగింది. పోలీస్ లాంఛనాల మధ్య డీజీపీ గన్ ఫైర్ చేసి, గాలిలోకి బెలూన్లు ఎగురవేసి పోటీలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా డీజీపీ డీజీపీ బి. శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. ముందుగా కార్యక్రమానికి హాజరైన వారందరినీ అభినందించారు. ఇటీవల రాష్ట్రంలో గ్లోబల్ సమ్మిట్, అంతర్జాతీయ ఫుట్‌బాల్ మ్యాచ్‌లు, గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికల బందోబస్తు మరియు సమ్మక్క-సారక్క జాతర వంటి కీలక బాధ్యతలను పోలీసులు అత్యంత నిబద్ధతతో నిర్వహించారని కొనియాడారు. పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం బిజీగా ఉన్నప్పటికీ సిబ్బంది క్రీడల్లో పాల్గొనడం వారిలో నూతనోత్సాహాన్ని నింపుతుందన్నారు. పోలీసులు వ్యాయామాన్ని నిత్య జీవితంలోనూ భాగం చేసుకోవాలన్నారు. క్రీడలు మనలోని నాయకత్వ లక్షణాలను తట్టి లేపడం తో పాటు టీమ్ స్పిరిట్, ఐకమత్యాన్ని పెంచుతాయన్నారు. క్రీడల్లో పాల్గొనే వారు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. క్రీడలు మానసిక స్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయన్నారు. క్రీడల్లో పథకాలు సాధించడం కంటే కూడా మంచి స్నేహితులను సాధించడం గొప్ప అన్నారు. మహిళా పోలీసుల ప్రాతినిధ్యం ప్రతి విభాగంలోనూ పెరగాలని, ప్రతిభతో పాటు నాయకత్వ లక్షణాలను చాటుకోవాలని సూచించారు. గెలుపోటముల కంటే క్రీడాస్ఫూర్తి, ఐక్యత మరియు పరస్పర గౌరవం ముఖ్యమని, ఇదే స్ఫూర్తిని వృత్తిలోనూ ప్రదర్శించాలని పిలుపునిచ్చారు.

# దళిత నాయకుడు బాల్క అరెస్టు దుర్మార్గం

(మొదటి పేజీ తరువాయి)

నిర్బంధించడాన్ని మాజీ మంత్రి హరీష్‌రావు తీవ్రంగా ఖండించారు. క్యాతన్ పల్లిలో బీఆర్‌ఎస్ పార్టీకి పూర్తి మెజారిటీ వచ్చినా కూడా కాంగ్రెస్ పార్టీ పట్టపగలు ప్రజాస్వామ్యాన్ని పరిహసించిన తీరు చూసి యావత్ తెలంగాణ అసహ్యించుకుంటున్నదని అన్నారు. అధికార బలం, పోలీసు బలం, ధన బలంతో చట్టాలను తుంగలో తొక్కడం కాంగ్రెస్ అరాచక వైఖరికి పరాకాష్ఠ అని దుయ్యబట్టారు. రాష్ట్రమంతా కాంగ్రెస్ మార్కు గూండాగిరి రాజ్యమేలుతున్నది. మున్సిపల్ ఎన్నికల వేళ కాంగ్రెస్ మురుగు రాజకీయాల వాసన కమ్ముకున్నది. హంగ్ వచ్చిన చోటల్లా ప్రతిపక్ష నాయకులను సంత భేరం చేస్తూ, కిడ్నాపులకు తెగబడుతూ ప్రజా తీర్పును కాలరాస్తున్న తీరుకు నిదర్శనాలు ఎన్నోనని అన్నారు. జనగాంలో దళిత మహిళా కౌన్సిలర్ బీఆర్‌ఎస్‌కు మద్దతుగా చెయ్యి ఎత్తితే రిటర్నింగ్ ఆఫీసర్ సాక్షిగా కాంగ్రెస్ గూండాలు చేసిన దాడిని సమాజం కళ్లారా చూసిందని వెల్లడించారు. తమ కళ్ళెదుట ఒక దళిత మహిళా నాయకురాలిపై కాంగ్రెస్ నాయకులు దాడికి తెగబడితే అధికారులు, పోలీసులు కళ్లప్పగించి చోద్యం చూశారే తప్ప అడ్డుకోలేదని అన్నారు. ఒక్క క్యాతనపల్లే కాదు తొర్రూరు, జనగాం, ఇబ్రహీంపట్నం, జహీరాబాద్ సహా హంగ్ వచ్చిన ప్రతి చోటా ప్రజా తీర్పును గౌరవించకుండా చైర్మన్ పీఠాలను అడ్డదారుల్లో దక్కించుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో భూములను కబ్జా చేసినట్లే, రాజకీయ పీఠాలను కూడా కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. బాల్క సుమన్ ను భేషరతుగా విడుదల చేయాలని, ప్రజాస్వామిక వాతావరణంలో క్యాతన్ పల్లి చైర్మన్ ఎన్నిక జరిగేలా బాధ్యత వహించాలని ఎన్నికల కమిషన్ ను డిమాండ్ చేశారు.

# అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు

- ఆన్‌లైన్ ద్వారా నమోదు ప్రక్రియ ప్రారంభం
- స్పెషల్ కమిషనర్ ప్రియాంక వెల్లడి

**హైదరాబాద్,ఫిబ్రవరి 18:** రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ జి ఓ ఎం ఎస్ నెం. 252 ప్రకారం అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయడం జరుగుతుందని సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, ఫ్రీ ల్యాన్సర్ మరియు వెటరన్ జర్నలిస్టులు అక్రిడిటేషన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి సమాచార శాఖ ప్రత్యేక వెబ్ సైట్ ను రూపొందించామన్నారు. సమాచారశాఖ వెబ్ సైట్ లో ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 9వ తేదీ నుండి దరఖాస్తు లను ఆ÷-లనైన్ లో తీసుకోవడం జరుగుతుందన్నారు. అక్రిడిటేషన్ దరఖాస్తు మరియు జారీ పక్రియ నిరంతరం కొనసాగుతుందని, దరఖాస్తు చేసుకునే సమయంలో ఏదైన టెక్నికల్ సమస్యలు ఉత్పన్నమైతే సమాచార శాఖ మీడియా రిలేషన్ విభాగంలో ఈ నెంబర్ 9154170881కు కార్యాలయం పని వేళలో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటలలో సంప్రదించవచ్చునని ఆమె ఆ ప్రకటనలో తెలిపారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# సురక్షితంగా డ్రైవింగ్ చేయండి, ప్రాణాలను కాపాడుకోండి



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి18:
జి.సుధీర్ బాబు, కమీషనర్ ఆఫ్ పోలీస్, ఫ్యూచర్ సిటీ కమీషనరేట్ ఉత్తర్వుల మేరకు, ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీస్ వారి ఆధ్వర్యంలో, జష్ట్ర. జితేందర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పీఎస్ నేతృత్వంలో ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.మద్యం సేవించి వాహనం నడపరాదు, వాహనాలను రాంగ్ రూట్‌లో నడపరాదు, డ్రైవింగ్ చేసేటప్పుడు మొబైల్ వాడకూడదు, తప్పనిసరిగా హెల్మెట్ ధరించవలెను, ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించవలెను. అని సుధీర్ బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్, ఆర్టీసీ డ్రైవర్లు, ఆర్టీసీ సిబ్బంది, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కింది అంశాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించబడింది. రోడ్డుమ్స ప్రమాదాలు తగ్గించి, ప్రజల ప్రాణాలు కాపాడడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం.

# హైదరాబాద్ నగరంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక,

- రెండు పడకల గదుల ఇండ్లపై సెక్రటేరియట్ లో సమీక్ష.
- సమీక్షలో పాల్గొన్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్.



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి18:-
రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖలు మరియు హైదరాబాద్ ఇంఛార్జ్ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన రాష్ట్ర సెక్రటేరియట్ లో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, రెండు పడకల గదుల ఇండ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ సహచర ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొని కంటోన్మెంట్ నియోజకవర్గంలో పేద ప్రజలు ఎక్కువగా ఉన్నందున అత్యధికంగా ఇళ్ళను కేటాయించాలని కోరారు.ఈ సమీక్షా సమావేశంలో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి వర్యులు మొహమ్మద్ అజహరుద్దీన్, రాజ్యసభ సభ్యులు అనీల్ కుమార్ యాదవ్ గార్లు కలెక్టర్ దాసరి హరి చందన, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్, హౌసింగ్ పిడి అశోక్ చక్రవర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రూ. 4 కోట్ల నిధుల అనుమతులకు కేఎల్ఆర్ కృషి

- రావిర్యాల - సూర్యగిరి ఎల్లమ్మ - సర్దార్ నగర్ రోడ్డుకు మహర్దశ కేఎల్ఆర్



హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని కెఎల్ఆర్ మాట్లాడుతూ..నిత్యం రద్దీగా ఉండే రావిర్యాల - సూర్యగిరి ఎల్లమ్మ తల్లి దేవాలయం రోడ్డుకు కాంగ్రెస్ ప్రభుత్వంలో మహర్దశ వచ్చింది.పెద్ద చెరువు పక్కన ఉండే రోడ్డు పనులు, విస్తరణ, మరమ్మతులకు రూ. 4 కోట్ల నిధులు వచ్చేలా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కృషి చేశారు.రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి సమస్యను తీసుకెళ్లి రావిర్యాల - సర్దార్ నగర్ రోడ్డు విస్తరణకు అనుమతులు వచ్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు కిచ్చెన్నబీఆర్ఎస్ పాలనలో ఎన్నో సార్లు మొర పెట్టుకున్నామని రావిర్యాల - సర్దార్ నగర్ ప్రజలు తెలిపారు. కనీసం స్పందించలేదని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.రావిర్యాల పెద్ద చెరువు తూము, రోడ్ల విస్తరణ కార్యక్రమాలన్నీ కేఎల్ఆర్ సహకారంతో చేసుకుంటున్నామని తుక్కుగూడ జిహెచ్ఎంసి డివిజన్ నాయకులు చెప్పారు.మహేశ్వరం నియోజకవర్గం జిహెచ్ఎంసి డివిజన్ల అభివృద్ధికి కృషి చేస్తానని లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ హామీలు గాలికి.26 నెలలైనా తీరని మహిళల,వృద్ధుల నిరీక్షణ

- తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, కప్పాటి పాండురంగా రెడ్డి ఆగ్రహం.



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి18:-
ఎన్నికల సమయంలో అరచేతిలో వైకుంఠం చూపించి, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను విస్మరించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగా రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం కొలువుదీరి 26 నెలలు గడుస్తున్నా, ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీల అమలులో దారుణమైన జాప్యం జరుగుతోందని ఆయన విమర్శించారు.
బుధవారం ?విలేకరులకు అందజేసిన పత్రికా ప్రకటనలో ఆయన ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తూ ఈ క్రింది డిమాండ్లను లేవనెత్తారు:?ప్రతి నెల మహిళలకు ?2500 మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్థిక సహాయం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, 26 నెలలు గడిచినా ఆ ఊసే ఎత్తకపోవడం మహిళా లోకాన్ని వంచించడమే. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ?వృద్ధాప్య పింఛన్ ?4000లకు, దివ్యాంగుల పింఛన్ ?6000లకు పెంచుతామని ఆడబిడ్డ వివాహానికి తులం బంగారం, చదువుకునే అమ్మాయిలకు స్కూటీలంటూ ఇచ్చిన హామీ ఏమైంది? పెరిగిన ధరలతో అల్లాడుతున్న సామాన్యులకు భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం, కాలయాపన చేస్తూ తత్సారం చేయడం అన్యాయం. తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలాలు, పింఛన్లు ఇవ్వడంపై సాక్షాత్తూ హైకోర్టు ప్రశ్నించే పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. తెలంగాణ సాధనలో ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన గుర్తు చేశారు. ఎన్నికల హామీలను నమ్మి ఓట్లేసిన ప్రజలను మోసం చేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు. ఇప్పటికైనా ప్రభుత్వం కుంటి సాకులు మానుకొని, తక్షణమే పెంచుతామన్న పింఛన్లను, మహిళలకు ఇస్తామన్న నగదును విడుదల చేయాలి. ఈ ఆర్థికసంవత్సరం ప్రవేశపెట్టే బడ్జెట్ లో నైన మహిళలకు, వృద్దులకు,దివ్యాంగులకు, ఉద్యమకారులకు,రైతులకు ఇచ్చిన హామీలు అమలయ్యేలా కేటాయింపులు చెయ్యాలని అన్నారు. లేనిపక్షంలో రాజకీయ పార్టీగా ఎర్పడుతున్న తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ప్రజల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం" అని కప్పాటి పాండురంగా రెడ్డి హెచ్చరించారు.

# హైదరాబాద్ నగరాన్ని దేశానికె నమునగా నిలబెడతాం





(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి18:-
తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (CURE)ను కాలుష్యరహిత గ్రీన్, నెట్ జీరో సేవల కేంద్రంగా అభివృద్ధి చేసి, సుస్థిర పట్టణాభివృద్ధిలో హైదరాబాద్ నగరాన్ని దేశానికే ఒక నమూనాగా నిలబెడతామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చెప్పారు. కార్బన్ ఫుట్‌ప్రింట్ ఆడిట్ చేపట్టనున్న తొలి భారత నగరంగా హైదరాబాద్ నిలవబోతుందని, రాబోయే ఐదేళ్లలో తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)లో కాలుష్య కారక పరిశ్రమలు ఉండవని స్పష్టం చేశారు. ముంబైలోని జియో కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన "ముంబై క్లైమెట్ వీక్" సదస్సులో నీతి ఆయోగ్ వైస్ చైర్మన్‌గా సుమన్ బేరీ, ఇతర అతిథులతో కలిసి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పాల్గొని ప్రసంగించారు. నగరాభివృద్ధి, వాతావరణ మార్పులకు అనుగుణమైన విధానాలపై ముఖ్యమంత్రి తెలంగాణ దృక్పథాన్ని వివరించారు. గ్రీన్ ఎనర్జీ ప్రపంచ పరిరక్షణకు లాభదాయకమని, తెలంగాణలో గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇస్తున్నామని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలోనూ గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ప్రస్తుత అభివృద్ధి వ్యూహంలో తయారీ రంగం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిరత్వం కీలకంగా మారాయన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ లక్ష్యాలను ప్రస్తావిస్తూ, రాష్ట్ర జీడీపీని 200 బిలియన్ డాలర్ల స్థాయి నుండి 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేస్తామన్నారు. భవిష్యత్ అభివృద్ధికి ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, విద్య, నైపుణ్యాలు, వనరులు, ఉపాధి ప్రధాన స్తంభాలుగా నిలుస్తాయని చెప్పారు.రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధికి తెలంగాణను జోన్‌లుగా విభజించినట్లు ముఖ్యమంత్రి వివరించారు. హైదరాబాద్ చుట్టూ 160 కి.మీ. పొడవున్న ఔటర్ రింగ్ రోడ్ లోపలి ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ )గా, ఓఆర్ఆర్ నుంచి రీజినల్ రింగ్ రోడ్ వరకు ఉన్న ప్రాంతాన్ని పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీ జోన్‌గా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. ప్యూర్ ప్రాంతాన్ని దేశంలోనే అతిపెద్ద తయారీ కేంద్రంగా అభివృద్ధి చేసి "చైనా +1" ప్రత్యామ్నాయంగా తెలంగాణను నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ తయారీ వృద్ధి గ్రీన్ ఎనర్జీ ఆధారంగా సాగుతుందని స్పష్టం చేశారు. అదేవిధంగా, 360 కిలోమీటర్ల పొడవున్న రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం కొనసాగుతోందని, రీజినల్ రింగ్ రైల్వే ప్రణాళికలు అమలులో ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణ విద్యుత్ వినియోగంపై మాట్లాడుతూ, 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో గరిష్ట డిమాండ్ 34,000 మెగావాట్లకు చేరుతుందని అంచనా వేశారు. ఇందులో గ్రీన్ ఎనర్జీ వాటా 25 శాతంగా ఉందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు, ముఖ్యంగా డేటా సెంటర్లు, పరిశ్రమలు గ్రీన్ ఎనర్జీని కోరుకుంటున్నాయని పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, విద్య, నైపుణ్యాలు, శక్తి, ఉపాధి, వ్యవస్థాపకత మధ్య సమతుల్యతను సాధిస్తూ, గ్రీన్ ఎనర్జీ రంగంలో తెలంగాణను మొత్తం దేశానికి ఆదర్శంగా నిలబెట్టడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# గిరిజన గురుకుల ప్రిన్సిపాల్, ఆర్సిఓ రత్న కుమారి లను సస్పెండ్ చేయాలని గిరిజన విద్యార్థుల భారీ ధర్నా.

- డిఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం మద్దతుతో ఊపందుకున్న విద్యార్థులు ధర్నాలో పాల్గొన్న డి ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర కార్యదర్శి కెలోత్ సాయికుమార్,రాష్ట్ర నాయకులు శాంతి కుమార్, కోశాధికారి గుగులోతు సూర్య ప్రకాష్.





(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి18:-
మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రెండు గంటల పాటు ఉద్రిక్తత వాతావరణం విద్యార్థుల ఆగ్రహానికి దిగి వచ్చిన ఆర్సిఓ రత్నకుమారి.15 సార్లు వినతిపత్రం ఇస్తే రాలేదు గానీ ధర్నా చేయంగానే ఉరుక్కుంటూ వచ్చావా అని విద్యార్థులు తిరగబడడంతో వెనుకదిరిగిన ఆర్సిఓ..మహబూబాబాద్ స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ కూతవేటు దూరంలో గిరిజన గురుకులం ప్రజా పాలనలో విద్యార్థుల గోసలు.. మున్సిపల్ క్యాంప్ రాజకీయాల కోసం వందల కోట్లు ఖర్చు పెడుతున్నారు మా కడుపులో బువ్వ పెట్టడానికి చేతులు రావడం లేదా.? మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని అడిగినందుకు తీవ్రంగా దుర్భాషలాడారు, ఆర్సీవోను సంప్రదిస్తే తాటతీస్తా అంటున్నారు. నీళ్లు లేక గుట్ట పైకి లోట పట్టుకొని బహిర్భూమికి వెళ్తున్న విద్యార్థులు. మా గోస ఎవరికి చెప్పుకోవాలంటు ఆగ్రహానికి గురై అంబేద్కర్ విద్యార్థులు విద్యార్థులు రోడ్డెక్కి భారీ ధర్నా చేశారు.

# మన అధ్యక్షురాలు రమాదేవికి ఆత్మీయ సత్కారం





హైదరాబాద్, ఫిబ్రవరి 18: మున్నూరుకాపు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (మన) నూతన అధ్యక్షురాలు ముడిచింతల రమాదేవి నగరానికి వచ్చిన సందర్భంగా మున్నూరుకాపు సంఘం రాష్ట్ర నాయకులు గోపిశెట్టి ప్రమోద్ నేతృత్వంలో సంఘం ప్రతినిధులు ఆమెను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్తర అమెరికాలో మున్నూరుకాపు సమాజ ఏకీకరణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మన స్వచ్ఛంద సంస్థ ద్వారా ఇమ్మిగ్రేషన్, మ్యాట్రిమోనీ, సంపద నిర్మాణం, వ్యవస్థాపకత, పెట్టుబడి రంగాల్లో సభ్యులకు సహాయ సహకారాలు, సలహాలు సూచనలు అందిస్తున్నట్లు ఆమె వివరించారు. గత ఏడాది 60కి పైగా ఆన్ లైన్ ద్వారా నిర్వహించిన వర్క్ షాప్ లకు మంచి స్పందన లభించిందని ఆమె పేర్కొన్నారు. మన సంస్కృతి పరిరక్షణలో భాగంగా సీతారామ కళ్యాణం, వనభోజనాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మన మాజీ అధ్యక్షుడు మాగంటి రమేష్, అనిల్ ముడిచింతల, ప్రొఫెసర్ సుంకరి రాంమూర్తి, డాక్టర్ పుంజాల వినయ్ కుమార్, పుంజాల అలేఖ్య, లయన్ ఆకుల రవీందర్ రావు, వైల శ్రీనివాస్ రావు, ఆకుల రామారావు, లవంగాల అనిల్ కుమార్, మంగళారపు లక్ష్మణ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# కాంగ్రెస్ ప్రభుత్వ హామీలు గాలికి.. 26 నెలలైనా తీరని మహిళల, వృద్ధుల నిరీక్షణ: కప్పాటి పాండురంగా రెడ్డి ఆగ్రహం



**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కేంద్రంలో పాండురంగారెడ్డి మాట్లాడుతూ...?ఎన్నికల సమయంలో అరచేతిలో వైకుంఠం చూపించి, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను విస్మరించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగా రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం కొలువుదీరి 26 నెలలు గడుస్తున్నా, ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీల అమలులో దారుణమైన జాప్యం జరుగుతోందని ఆయన విమర్శించారు. బుధవారం విలేకరులకు అందజేసిన పత్రికా ప్రకటనలో ఆయన ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తూ ఈ క్రింది డిమాండ్లను లేవనెత్తారు:ప్రతి నెల మహిళలకు 2500 మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్థిక సహాయం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, 26 నెలలు గడిచినా ఆ ఊసే ఎత్తకపోవడం మహిళా లోకాన్ని వంచించడమే. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.వృద్ధాప్య పింఛన్ 4000లకు, దివ్యాంగుల పింఛన్ 6000లకు పెంచుతామని ఆడబిడ్డ వివాహానికి తులం బంగారం, చదువుకునే అమ్మాయిలకు స్కూటిలంటూ ఇచ్చిన హామీ ఏమైంది? పెరిగిన ధరలతో అల్లాడుతున్న సామాన్యులకు భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం, కాలయాపన చేస్తూ తత్సారం చేయడం అన్యాయం. తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలాలు, పింఛన్లు ఇవ్వడంపై సాక్షాత్తూ హైకోర్టు ప్రశ్నించే పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. తెలంగాణ సాధనలో ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన గుర్తు చేశారు."ఎన్నికల హామీలను నమ్మి ఓట్లేసిన ప్రజలను మోసం చేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు. ఇప్పటికైనా ప్రభుత్వం కుంటి సాకులు మానుకొని, తక్షణమే పెంచుతామన్న పింఛన్లను మరియు మహిళలకు ఇస్తామన్న నగదును విడుదల చేయాలి.ఈ ఆర్థికసంవత్సరం ప్రవేశపెట్టే బడ్జెట్ లో నైన మహిళలకు,వృద్ధులకు,దివ్యాంగులకు,ఉద్యమకారులకు,రైతులకు ఇచ్చిన హామీలు అమలయ్యేలా కేటాయింపులు చెయ్యాలని అన్నారు. లేనిపక్షంలో రాజకీయ పార్టీగా ఎర్పడుతున్న తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ప్రజల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం" అని కప్పాటి పాండురంగా రెడ్డి హెచ్చరించారు.కప్పాటి పాండురంగా రెడ్డితెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు,రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్

# డాక్టర్ జి సంజీవరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన నడికుడ శివ




**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం ఐఎన్టియుసి కార్మిక శాఖ అధ్యక్షులు నడికుడ శివ మాట్లాడుతూ.. ఆల్ ఇండియా ఐఎన్టియుసి అధ్యక్షులు మరియు సిడబ్ల్యుసి సభ్యులు డాక్టర్ జి సంజీవరెడ్డి జన్మదినం సందర్భంగా శాలువతో సన్మానించి మర్యాదపూర్వకంగా పుష్ప గిచ్చమిచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు నడికుడ శివ మహేశ్వరం నియోజకవర్గం ఐఎన్టీయూసీ అధ్యక్షులు తోపాటు ఈ కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు కొండూరు గణేష్ గ్రామ శాఖ అధ్యక్షులు నడికుడా కార్తీక్ కృష్ణ విక్రం మరియు ఐ ఎన్ టి సి సంబంధించిన నాయకులు అధిక సంఖ్యలో జన్మదిన వేడుకలలో పాల్గొనడం జరిగిందని శివ తెలియజేశారు.

# తప్పుడు కుల పత్రంతో గెలిచిన నీలం శ్వేతపై కలెక్టర్ కు ఫిర్యాదు.

**- నీలం శ్వేతా బాలకిషన్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.**

**- కాంగ్రెస్ పార్టీ 23వ అభ్యర్థి చెనమోని చంద్రకళ యాదగిరి ముదిరాజ్.**

**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి18:-**

ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి తప్పుడు కుల పత్రంతో ఇబ్రహింపట్నం మున్సిపాలిటీ 23వ వార్డు కౌన్సిలర్ గా ఎన్నికైన నీలం శ్వేత బాలకిషన్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చెనమోని చంద్రకళ యాదగిరి ముదిరాజ్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు, ఇబ్రహీంపట్నం తహసిల్దార్ కు, ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనంత రెడ్డికి, మున్సిపల్ కమిషనర్ కు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఎన్నికలలో 23వ వార్డు బిసి మహిళ కు రిజర్వేషన్ కేటాయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈ ఎన్నికలలో నాతో పాటు 23వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేసిన నీలం స్వేత భర్త బాలకిషన్ ఈ అభ్యర్థి అసలు కులం ఒసి కాపు సామాజిక వర్గానికి చెందిన కుటుంబం పొలనాటి స్వేత




తండ్రి లేట్.పి.డి.ప్రసాద్, తల్లి పేరు పొలనాటి వెంకట లక్ష్మి, ఈ అభ్యర్థి పేరు నీలం స్వేత ఇబ్రహింపట్నం నివాసి, ఈ అభ్యర్థి ప్రేమించి బిసి కులస్థుడిని కులాంతర వివాహం చేసుకున్నది. ఆమె అధికారులను తప్పుదోవ పట్టించి అక్రమంగా ఉద్దేశపూర్వ కంగా బిసి కుల దృవీకరణ పత్రం పత్రం పొంది, ఎన్నికలలో పోటీ చేయడం జరిగింది. ఈ వ్యవహారంలో పురపాలక స్థాయిలో ఎటువంటి విచారణ చేయకుండా, బిసి కుల దృవీకరణ పత్రం ఇచ్చిన అధికారులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకొని భారత రాజ్యాంగం పరిధిలో పని చేసే ఎన్నికల అధికారులను తప్పు దోవ పట్టించి తప్పుడు పత్రాలతో గెలుపొంది రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరించిన వీరిపై తక్షణమే విచారణ జరపి పదవి నుండి తొలగించి ఆ స్థానంలో నన్ను ఇబ్రహింపట్నం మున్సిపాలిటి 23వ వార్డు కౌన్సిలర్ గా అధికారికంగా ప్రకటించగలరని తెలిపారు. అప్పటి వరకు వీరి ద్వారా ఇబ్రహింపట్నం మున్సిపాలిటిలో 23వ వార్డు పరిధిలో ఎటువంటి ఆధికారిక వ్యవహారాలు జరుపకుండా తక్షణమే ఆదేశాలు ఇవ్వగలరని, అలాగే వీరు చట్టవ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడినందున వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకొని నాకు న్యాయం కోరారు.

# భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు కోటి 20 లక్షలు నడికుడ శివ



**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని నాగిరెడ్డిపల్లి లో మహేశ్వరం నియోజకవర్గం ఐఎన్టియుసి కార్మిక శాఖ అధ్యక్షులు నడుకుడ శివ మాట్లాడుతూ.. ఐటీ పార్కులో భూములు కోల్పోయిన రైతులకు మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి చొరవతో ఆర్డిఓ ద్వారా ఎకరాకు కోటి 20 లక్షల రూపాయల చొప్పున అందజేయడం జరిగింది 24 ఎకరాలకి చెక్కులను అందజేయడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్ర నవీన్ కుమార్ నాగిరెడ్డిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు కొండూరి గణేష్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నడికుడా కార్తీక్ మరియు గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ వింగ్ రంగారెడ్డి జిల్లా ఛైర్మన్ గా బబ్బూరు పృథ్వీ గౌడ్

**- రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి**

**- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తా : బబ్బూరు పృథ్వీ గౌడ్**





**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి ఎల్బీనగర్.**

కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ వింగ్ రంగారెడ్డి జిల్లా ఛైర్మన్ గా బబ్బూరు పృథ్వీ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ వింగ్ రాష్ట్ర ఛైర్మన్ డాక్టర్ ఎం.రాజీవ్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్స్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ వింగ్ రంగారెడ్డి జిల్లా ఛైర్మన్ గా నియమితులైన బబ్బూరు పృథ్వీ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. రంగారెడ్డి జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైద్యులను ఏకతాటిపైకి తీసుకొచ్చి వారి సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేస్తానని హామీనిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రాభివృద్ధికి ఎంతో శ్రమిస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర సర్కారు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వైద్యులకు తెలియజేసి వారిలో చైతన్యం తీసుకువచ్చేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. తనను డాక్టర్స్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ వింగ్ రంగారెడ్డి జిల్లా ఛైర్మన్ గా నియమించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు, పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ కు, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు, కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ వింగ్ రాష్ట్ర ఛైర్మన్ డాక్టర్ ఎం.రాజీవ్ తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# 30 ఏళ్ళ తర్వాత నాగిరెడ్డిపల్లి రైతుల భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు కోటి 20 లక్షలు సర్పంచ్ వినోద్ రాథోడ్



**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని నాగిరెడ్డిపల్లి గ్రామం లో మహేశ్వరం నియోజకవర్గం పడమటి తండా సర్పంచ్ వినోద్ రాథోడ్ మాట్లాడుతూ.. ఐటీ పార్కులో భూములు కోల్పోయిన రైతులకు పడమటి తండా సర్పంచ్ వినోద్ రాథోడ్ గారు ఆర్డిఓ ద్వారా ఎకరాకు కోటి 20 లక్షల రూపాయల చొప్పున అందజేయడం జరిగింది. 24 ఎకరాలకి చెక్కులను అందజేయడం జరిగింది. ఈ భూములు 30 ఏళ్ల గా నిరీక్షణ లో ఈ రోజు రైతులకు చెక్కులు పంపిణీ చేయడం జరిగింది.ఈ యొక్క కార్యక్రమంలో పడమటి తండా సర్పంచ్ వినోద్ రాథోడ్, నాగిరెడ్డి పల్లి సర్పంచ్ దేవుల నాయక్, మాజీ సర్పంచ్ రాములు నాయక్, ఎంపీటీసీ రమేష్, నడ్డికూడా శివ మరియు గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

# అక్రమాలపై కఠిన చర్యలు తప్పవు కోడ్ ఆడిట్‌కు ఆదేశాలు


**- ధరణి దోపిడిపై ఉక్కుపాదం తీగలాగితే**

**- డొంక కదిలినట్లుగా ధరణి వ్యవహారం.**

**- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.**

**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి18:-**

తీగ లాగితే డొంక కదిలినట్లుగా ధరణి పోర్టల్ వ్యవహారం ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజల ఆస్తుల రక్షణకు నిర్మించవలసిన వ్యవస్థనే ఆనాటి ప్రభుత్వంలోని కొంతమంది ప్రముఖులు తమ స్వార్ధ ప్రయోజనాల కోసం వాడుకున్నారని మండిపడ్డారు. ధరణి పోర్టల్ లోని లొసుగులను ఆసరాగా చేసుకొని స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలను కొల్లగొట్టిన సంఘటనపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించగా దిగ్భ్రాంతి కరమైన అనేక కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. ఇది సాధారణ సాంకేతిక లోపం కాదని వ్యవస్థాగతంగా సృష్టించిన లోపాల ఫలితమని స్పష్టం చేశారు. బుధవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో ఉన్నతస్థాయి కమిటీతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆనాడు ధరణి పోర్టల్ సెక్యూరిటీ ఆడిట్ చేసిన సమయంలో గుర్తించిన లోపాలను సరిదిద్దకుండానే అంతా సవ్యంగానే ఉన్నట్లుగా నివేదిక ఇచ్చారని అలాగే మానవ ప్రమేయంతో తప్పులు చేసే విధంగా పోర్టల్ ను రూపొందించారని, భూముల లావాదేవీలకు



సంబంధించి అనుమానాస్పదంగా ఉన్న భూముల సమాచారం లభించకుండా లాగిన్‌లు డిలిట్ చేశారని, అత్యంత రహస్యంగా ఉండవలసిన లాగిన్ వివరాలు లేకుండా పోయాయని ఉన్నత స్థాయి కమిటీ విచారణలో ప్రాధమికంగా గుర్తించడం జరిగిందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన భూలావాదేవీల సమాచారం లభించకుండా చేశారని, ఫోరెన్సిక్ ఆడిట్‌లో కోడ్ ఆడిట్ నిర్వహించలేదన్న విషయం బహిర్గతమైందని, ఈ నేపధ్యంలో తక్షణమే ధరణి పోర్టల్ పై కోడ్ ఆడిట్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ధరణి పోర్టల్ నిర్వహణా బాధ్యతను టెర్రాసిస్ అనే విదేశీ సంస్థకు అప్పగించడం వల్లే సమస్యలు ఎదురవుతున్నాయని గుర్తించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు ధరణి లోపాలను అడ్డుపెట్టుకొని ప్రభుత్వానికి రావలసిన స్టాంప్‌డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలను కొల్లగొట్టిన వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని, తప్పుచేసినవారు ఎవరినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ప్రభుత్వానికి రావలసిన ప్రతిపైసాను వసూలు చేస్తామన్నారు. దీనిపై ఉన్నత స్థాయి కమిటీ ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకొని భవిష్యత్తులో అలాంటి పొరపాట్లు జరగకుండా ఏ చిన్న లోపానికి తావులేకుండా అధికారుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా ప్రజలకు ఫ్రెండ్లీగా ఉండేలా భూభారతి పోర్టల్ ను నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రజల భూముల విషయంలో ఎటువంటి రాజీ పడబోమని, ధరణి పేరుతో జరిగిన ప్రతి అక్రమాన్ని వెలికితీస్తామని, సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో నిర్వహించిన విధంగానే మిగిలిన జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, సిఎం ఆర్వో మందా మకరంద్, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంత్, ఉన్నత స్థాయి కమిటీ సభ్యులు స్టాంప్స్, రిజిస్ట్రేషన్ డిఐజి సుభాష్, ఎస్‌బి ఎస్పీ సింధు శర్మ, సైబర్‌క్రైమ్ డిఎస్పీ ఎ. సంపత్, హోంశాఖ సలహాదారు పి. శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రంజాన్ మాస ప్రారంభ శుభాకాంక్షలు.



**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి18:-**

ఇస్లాం మతస్తులు పవిత్రంగా భావించే రంజాన్ మాసం ప్రారంభ దినం సందర్భంగా.. ముస్లిం సోదర సోదరీమణులకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర ఉపవాస దీక్షలతో, ప్రత్యేక ప్రార్థనలతో, దైవభక్తితో సాగే రంజాన్ మాసంలో ఆధ్యాత్మికత, భక్తి భావన వెల్లివిరుస్తుందని కేసీఆర్ తెలిపారు. రంజాన్ మాసం సందర్భంగా తెలంగాణ, ముఖ్యంగా హైదరాబాద్ నగరం గంగాజమునా తెహజీబ్ కుదర్పణంగా నిలుస్తుందని కేసీఆర్ తెలిపారు. రంజాన్ మాస ఉపవాస దీక్షల సందర్భంగా ప్రజల నడుమ శాంతి సామరస్యాలు, సౌభ్రాతృత్వ భావనలు మరింతగా పెంపొందాలని, ఆ దేవుని కృప ప్రజలందరి మీద ఉండాలని కేసీఆర్ ఆకాంక్షించారు

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# ఇచ్చిన మాట ప్రకారం ఇళ్ల స్థలాలు కేటాయించాలి



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి18:- ఆదిభట్ల గ్రామము అన్ని సంఘాల వారికి యువకులకు పెద్దలకు చిన్న లకు తమ్ముళ్లకు అన్నలకు తెలియజేయునది. అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆదిభట్ల రైతుల నుండి 600 ఎకరాలు భూమిని తీసుకోవడం జరిగింది, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న తర్వాత ఇంటికొక జాబు వంద గజాల ఇళ్ల స్థలం ఇస్తామని మాట ఇచ్చి తప్పింది. ఇప్పుడు అదే కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది కనుక మన ఊరిలో గవర్నమెంట్ ల్యాండ్ 51.52.53 మూడు సర్వే నెంబర్ లో 55 ఎకరాల నుండి 56 వరకు గవర్నమెంట్ ల్యాండ్ ఉంది ఇది ఏపీ ఐ సి లో ఉన్నది మరి 45 సర్వే నెంబర్లు 19 ఎకరాల 18 గుంటలు స్టేట్ గవర్నమెంట్ లో ఉంది, ఇది గవర్నమెంట్ ల్యాండే 79 లో ఐదు ఎకరాలు గవర్నమెంట్ ల్యాండ్ ఉంది, ఈ ఇంటి స్థలాలని పంచుమని గ్రామ ప్రజలు మేము సంవత్సరం నుండి పోరాటం చేస్తున్నాం. సంబంధించినటువంటి అధికారుల చుట్టూ మన ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు ఎమ్మెల్యే దగ్గరికి పలు మార్లు పోవడం జరిగింది, ఆయన దృష్టికి ఈ సర్వే నెంబర్లను కూడా తీసుకెళ్లాం దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి పంచుదాం అని చెప్పడం జరిగింది. ఇంతవరకు ప్రభుత్వం ఎలాంటి యాక్షన్ తీసుకోలేదు ప్లాట్లు ఇచ్చేంతవరకు ఊరి వాళ్లకు పోరాడుతూనే ఉంటాం అని పల్లె శ్రీనివాస్ గౌడ్ తెలియజేశారు.

# కులం పేరుతో మహిళను దూషించిన ఘటనలో నిందితుల రిమాండ్

**- మెదక్ డియస్పి డి. ప్రసన్నకుమార్.**




(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి18:- మెదక్ పట్టణంలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా రాజకీయ మద్దతు విషయంలో ఏర్పడిన వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కులం పేరుతో మహిళను దూషించడమే కాకుండా, ఎమ్మెల్యే వాహనంపై రాళ్లతో దాడి చేసి చంపాలనే ప్రయత్నం చెసిన ఘటనకు సంబంధించి నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు మెదక్ డియస్పి డి. ప్రసన్నకుమార్, తెలిపారు. మెదక్ డియస్పి డి. ప్రసన్నకుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. కాంగ్రెస్ పార్టీ మహిళ కార్యకర్త మున్సిపల్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో 15వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి భర్త మల్లికార్జున్ గౌడ్ మరియు అతని అనుచరులు ఆమెను బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. అయితే ఆమె ఇందుకు నిరాకరించడంతో, 09-02-2026 తేదీ రాత్రి సుమారు 10 గంటల సమయంలో మల్లిఖర్జున్ గౌడ్ ఆమెను కులం పేరుతో దూషిస్తూ బూతు మాటలు మాట్లాడినట్లు ఫిర్యాదు అందినట్లు తెలిపారు. ఈ ఘటన విషయమై బాధితురాలు స్థానిక ఎమ్మెల్యేకి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఆమెను పరామర్శించేందుకు బయలుదేరిన సమయంలో, పిట్లం బేస్ చెరువు కట్ట వద్ద బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్యకర్తలు మల్లిఖర్జున్ గౌడ్, జీవన్ రావు, వేణు, హబీబ్, మల్లేష్ తదితరులు కలిపి మొత్తం 23 మంది కలిసి ఎమ్మెల్యే వాహనంపై రాళ్లతో దాడి చేసి చంపాలనే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో వాహనానికి నష్టం వాటిల్లడంతో పాటు ఎమ్మెల్యేకి, ఆయన అనుచరులకు గాయాలు అయినట్లు పేర్కొన్నారు. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఓ మహిళపై మల్లికార్జున్ గౌడ్ ఛాతిపై చేయి వేసి తోసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గోదాల అఖిలను కులం పేరుతో దూషించిన ఘటనపై సంబంధిత సెక్షన్లతో పాటు ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డియస్పి తెలిపారు. ఈ కేసులో కొందరు నిందితులు పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలిస్తామని ఆయన స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

# దివ్యాంగులకు ఉపాధి కల్పన పై శిక్షణ



హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి) దివ్యాంగులకు స్వయం ఉపాధి పై డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగినది అనంతరం రెడ్డిస్ ఫౌండేషన్ తెలంగాణ మేనేజర్ సాయి తేజ మాట్లాడుతూ దివ్యాంగుల అభివృద్ధికి తమ సంస్థ ఎల్లప్పుడూ సహాయ సహకార అందిస్తుందని దివ్యాంగులు ఒకరిపై ఆధారపడకుండా స్వశక్తితో ఎదగాలని తమ సంస్థ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని వారు అన్నారు ఉమ్మడి నూతనకల్ మద్దిరాల మండలంలోని 25 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రలు అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో నల్గొండ క్లాస్టర్ ఆర్గనైజర్ మణికంఠ, సూర్యాపేట జిల్లా క్లస్టర్ ఆర్గనై జర్ మహేష్, నూతనకల్ మండల ఏపిఎం మద్దిరాల మండల ఎపిఎం తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు కల్వకుంట్ల కవిత రంజాన్ మాస శుభాకాంక్షలు



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి18:- ముస్లింలకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రంజాన్ మాస ప్రారంభం సందర్భంగా ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఆకాశంలో నెలవంక కనిపిం చడంతో రంజాన్ మాస వేడుకలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదర, సోదరీమణులు కఠిన ఉపవాసాలతో అల్లాహ్ పై తమ భక్తిని చాటుకుంటారని తెలిపారు. రంజాన్ మాసం సామరస్యానికి, సోదరభవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# అంత్యక్రియలలో పాల్గొన్న మల్ రెడ్డి రామ్ రెడ్డి





(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి18:- తుర్కయాంజల్ బ్రిలియంట్ స్కూల్ ఛైర్మన్ పుల్లగుర్రం పురుషోత్తం రెడ్డి, గంగిరెడ్డి మధు సూదన్ రెడ్డి, మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత షాద్ నగర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. తుర్కయాంజాల్‌లో నిర్వహించిన అంత్యక్రియల్లో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి. పాల్గొని మృతులకు నివాళులు అర్పించి, సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# హైదరాబాద్‌లో అనుమతి లేకుండానే వైద్యం..

## 250 ప్రైవేటు హాస్పిటల్స్ సీజ్‌కు రంగం సిద్ధం..




హైదరాబాద్ : మేడ్చల్ జిల్లాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా నడుస్తున్న 250 ప్రైవేటు ఆసుపత్రులపై కొరడా ఝుళిపించేందుకు వైద్య ఆరోగ్య శాఖ సిద్ధమైంది. ఆయా ఆసుపత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. గత ఆరు నెలలుగా చేపట్టిన సర్వేలో ఈ అక్రమాలు వెలుగుచూశాయి. నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలకు మూడు రోజుల గడువునిస్తూ.. అప్పటి వరకు కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశించారు.

హైలైట్:అనుమతి లేకుండానే వైద్యంవిద్య, వైద్యంతో వ్యాపారం చేయకూడదని అంటుంటారు. కానీ ప్రస్తుతం ఆ రెండే ప్రధాన వ్యాపారాలుగా మారాయి. కొందరు అక్రమార్జనే ధ్యేయంగా ఎలాంటి అనుమతులు లేకుండానే హాస్పిటల్స్ ఓపెన్ చేసి వైద్యం చేస్తున్నారు. కొందరైతే నకిలీ డాక్టర్లతో వైద్యం చేయిస్తూ.. ప్రజల ప్రాణాల మీదుకు తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాలోని ప్రైవేటు హాస్పిటల్స్‌పై తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ కఠిన చర్యలకు ఉపక్రమించింది. నిబంధనల ప్రకారం తప్పనిసరిగా ఉండాల్సిన ముందస్తు రిజిస్ట్రేషన్ లేకుండానే వైద్య సేవలు నిర్వహిస్తున్న దాదాపు 250 ప్రైవేటు ఆసుపత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నిర్ణయించారు. వీటిలో హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలోని 224 ఆసుపత్రులు ఉండగా.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని మరో 26 హాస్పిటల్స్ ఉన్నాయి. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో గత ఆరు నెలలుగా ఫేక్ డాక్టర్లు, అనధికార హాస్పిటల్స్‌ను గుర్తించేందుకు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో ఈ అక్రమాలు వెలుగుచూశాయి. హైదరాబాద్ జిల్లా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. వైద్య వృత్తిలో ఉన్నవారు నిబంధనల పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా హాస్పిటల్స్ నడపడం సరికాదని పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న హాస్పిటల్స్ తమ వద్ద ఉన్న పత్రాలను సమర్పించి, రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసే వరకు కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే.. అధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా డాక్టర్లను ఇతర సిబ్బందిని నియమించుకున్న హాస్పిటల్స్‌పైనా కఠిన చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు వెల్లడి ంచారు .మరోవైపు అర్హత లేని వ్యక్తులు హాస్పిటల్స్ నడుపుతున్నట్లు తేలితే వాటిని తక్షణమే సీజ్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నారు. నోటీసులు అందుకున్న హాస్పిటల్స్ సరైన వివరణ ఇవ్వకుంటే నేషనల్ మెడికల్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం 50 వేల నుంచి 5 లక్షల రూపాయల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని ౦+వీజ పబ్లిక్ రిలేషన్స్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ గుండగాని శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం సుమారు 4 వేల వరకు ప్రైవేటు హాస్పిటల్స్, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు ఉన్నాయి. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ఫేక్ డాక్టర్లను ఏరివేసేందుకు అధికారులు ప్రస్తుతం వైద్యుల సర్టిఫికేట్లను, లైసెన్సులను నిశితంగా
పరిశీలిస్తున్నారు. గత కొన్నేళ్లుగా వందలాది మంది ఫేక్ డాక్టర్లపై ఇప్పటికే కేసులు నమోదైన నేపథ్యంలో..
తాజా తనిఖీలు నగర వైద్య రంగంలో

# ఈ నెల చివరిలోగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు..

## గుడ్‌న్యూస్ చెప్పిన మంత్రి పొంగులేటి



హైదరాబాద్, మల్కాజిగిరి : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురు చూస్తున్న పేదలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఈ మూడు కార్పొరేషన్ల పరిధిలో ఇళ్ల స్థలాలు ఉన్న పేదలకు ఫిబ్రవరి చివరి వారంలోగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఇవ్వాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురు చూస్తున్న పేదలకు రేవంత్ సర్కార్ తీపి కబురు చెప్పింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల క్యూర్ పరిధిలో త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం (ఫిబ్రవరి 17) సెక్రటేరియట్‌లో క్యూర్ పరిధిలో హౌసింగ్ పాలసీపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ మురికివాడల్లో నివసిస్తున్న పేదలు ఇతర ప్రాంతాల్లో ఇళ్లను తీసుకోవటానికి ఇష్ట పడటం లేదని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. నగరానికి దూరంగా వెళితే.. తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందని వారు ఆసక్తి చూపటం లేదని వివరించారు. గతంలో 42 వేల నివాసాలు నిర్మించగా అందులో సగం మంది మాత్రమే శివారు ప్రాంతాల్లో నివసిస్తున్నారని తమ సర్వేలో తేలినట్లు హౌసింగ్ శాఖ అధికారులు చెప్పారు. దీంతో నిరుపేదల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బంది లేకుండా వారి నివాస ప్రాంతాలకు దగ్గరగా ఇళ్లను నిర్మించే ఆలోచన చేయాలన్నారు. మురికివాడల్లో స్థలం ఉన్నవారు అంగీకరిస్తే ఐదు నుంచి పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించే ప్రణాళికలు ఉన్నాయని చెప్పారు. కేబినెట్ సమావేశంలో ఈ విషయంపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. హైదరాబాద్ నగరంలోని మూడు కార్పొరేషన్ల కమిషనర్లు, 4 జిల్లాల కలెక్టర్లు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. అక్కడ ఉన్న లబ్ధిదారులు, ఎన్ని ఇళ్లను నిర్మించవచ్చుననే వివరాలతో పది రోజుల్లో నివేదిక అందించాలన్నారు. శిథిలావస్థకు చేరిన జేఎన్ఎన్‌యూఆర్ఎం నివాసాల స్థానంలో కూడా కొత్తగా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించే ఆలోచన చేస్తున్నామని చెప్పారు.

మూడు కార్పొరేషన్ల పరిధిలో ఇళ్ల స్థలాలు ఉన్న మట్నత్తం 28 వేల మంది లబ్ధిదారులకు ఈ నెల చివరిలోగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లతో పాటు ఇప్పటికే పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లకు మార్చి చివరి నాటికి లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేయడంతోపాటు మౌలిక వసతులకు హౌసింగ్ కార్పొరేషన్ నుంచి మంజూరు చేయాలని సూచించారు. విద్యుత్ పంపిణీ సంస్థలు కరెంట్ మీటర్లను డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల పేర్లమీదకు బదిలీ చేయాలన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
# హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక




## వారణాసిలో కన్నడ సూపర్ స్టార్- వాట్ ఎ క్రేజీ కాంబో

సూపర్ స్టార్ మహేష్ బాబు- రాజమౌళి కాంబినేషన్ లో తెరకెక్కుతోన్న చిత్రం వారణాసి. పాన్ వరల్డ్ లెవెల్ లో చిత్రీకరణ జరుపుకొంటోందీ మూవీ. గత ఏడాది నవంబర్ లో రిలీజ్ అయిన టైటిల్ గ్లింప్లెస్ ఈ సినిమాపై హై ఎక్స్ పెక్టేషన్స్ ఇచ్చాయి. సినిమాపై అంచనాలను ఆకాశానికి చేర్చాయి. రుద్రగా గతంలో ఎప్పుడూ చేయని రోల్ లో మెరుపులు మెరిపించబోతోన్నాడు మహేష్ బాబు. ప్రియాంక చోప్రా, మలయాళ సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ ది ఇందులో కీ రోల్.ఎం.ఎం. కీరవాణి సంగీతం, వీ విజయేంద్ర ప్రసాద్ కథ అందిస్తున్నారు. 2027 ఏప్రిల్ 7వ తేదీన విడుదల కాబోతోంది. ఈ విషయాన్ని వారణాసి యూనిట్ ఇదివరకే అధికారికంగా వెల్లడించింది. విడుదల తేదీని అనౌన్స్ చేస్తూ ఓ న్యూ పోస్టర్ సోషల్ మీడియాలో పోస్ట్ అయింది. అంతరిక్షం నుంచి దూసుకొచ్చిను ఓ భారీ ఉల్క.. భూమిని బద్దలు కొట్టేలా ఢీ కొట్టేలా డిజైన్ చేసిన పోస్టర్ అది. ఇది 7 ఆకారంలో కనిపించింది. వచ్చే ఏడాది జనవరి/ఫిబ్రవరి నాటికి షూటింగ్ పూర్తి కావొచ్చు.ఈ సినిమాలో కన్నడ సూపర్ స్టార్ కిచ్చా సుదీప్ కీలక పాత్ర పోషించనున్నట్లు తాజాగా సినీ వర్గాల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. ఈగ తర్వాత రాజమౌళి, సుదీప్ కాంబినేషన్లో రానున్న మరో చిత్రం ఇదే అవుతుంది. రాజమౌళి దర్శకత్వం వహించిన బాహుబలి ది బిగినింగ్ లో కూడా మెరిశాడు సుదీప్. చిన్న పాత్రే అయినా గుర్తుండిపోతుందది. అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ వారణాసిలో సుదీప్‌కు ముఖ్యమైన పాత్ర దక్కిందని చెబుతున్నారు.విజువల్ వండర్ గా తెరకెక్కుతోందీ ప్రిస్టేజియస్ ప్రాజెక్ట్. గ్రాఫిక్స్, ఇతరత్రా ప్యాచ్ వర్క్ ను పూర్తి చేసుకుని సినిమా ఏప్రిల్ 7న విడుదల అవుతుంది.

సినిమా చిత్రీకరణ దాదాపు 50 శాతం పూర్తయింది. సినిమా మొత్తానికే హైలైట్.. రామాయణం ఎపిసోడ్. అత్యంత సవాల్ తో కూడుకున్నది కూడా. ఈ ఎపిసోడ్ లోనూ కిచ్చ సుదీప్ కనిపిస్తాడనే ప్రచారం జరుగుతోంది. ఆ క్యారెక్టర్ కు అతనైతేనే సూట్ అవుతాడని రాజమౌళి భావిస్తున్నారు. సుదీప్ ఎంట్రీపై అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది.




## సత్యదేవ్ కొత్త సినిమా షురూ.. క్లాప్ కొట్టిన అనిల్ రావిపూడి

యువ నటుడు సత్యదేవ్ కథానాయకుడిగా నటిస్తున్న 15వ చిత్రం బుధవారం హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో వైభవంగా ప్రారంభమైంది. లక్ష్మీనారాయణ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని త్రిషూల్ విజినరీ స్టూడియోస్ పతాకంపై నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో సత్యదేవ్‌కు జోడీగా 'జాతిరత్నాలు' ఫేమ్ ఫరియా అబ్దుల్లా నటిస్తుండగా, ప్రముఖ గాయకుడు రామ్ మిర్యాల ఈ సినిమాతో పూర్తిస్థాయి సంగీత దర్శకుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నారు.

ఈ సినిమా ప్రారంభోత్సవ వేడుకకు సినీ ప్రముఖులు హాజరై చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టగా, నిర్మాత వంశీ నందిపాటి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. స్నేహం నేపథ్యంలో సాగే పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం 'రావుబహదూర్', 'గరుడ చాప్టర్-1' వంటి వైవిధ్యమైన సినిమాలతో బిజీగా ఉన్న సత్యదేవ్, ఈ కొత్త ప్రాజెక్టుతో మరో ఆసక్తికరమైన జోనర్‌లో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు.

## బర్త్‌డే స్పెషల్.. మరో ఇంటెన్స్ రోల్‌లో అనుపమ పరమేశ్వరన్



టాలీవుడ్ క్యూట్ సెన్సేషన్, పాన్ ఇండియా నటి అనుపమ పరమేశ్వరన్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ అందింది. ఆమె ప్రధాన పాత్రలో ఒక భారీ సైకలాజికల్ థ్రిల్లర్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఎస్ కే గీ ఎంటర్టైన్మెంట్ మరియు బెంచ్‌మార్క్ స్టోరీటెల్లర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఆర్జే షాన్ దర్శకత్వం వహించబోతున్నాడు. గతంలో అనుపమ మరియు షాన్ కాంబినేషన్‌లో వచ్చిన ఒక షార్ట్ ఫిల్మ్ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై సెన్సేషన్ క్రియేట్ చేయడంతో, ఇప్పుడు అదే జోడీ వెండితెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమవుతుంది. శివిన్ నారంగ్, ప్రేరణ అరోరా, కిరణ్ బల్లపల్లి నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ చిత్రం ఒక ప్రముఖ స్టూడియో భాగస్వామ్యంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందనుంది.ముఖ్యంగా ఈ చిత్ర నిర్మాత ప్రేరణ అరోరా గతంలో బాలీవుడ్‌లో 'రుస్తుం', 'ప్యాడ్ మ్యాన్', 'టాయిలెట్: ఏక్ ప్రేమ్ కథ' వంటి జాతీయ స్థాయి విజయవంతమైన చిత్రాలను నిర్మించి తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇటీవలే 'జటాధర' మూవీని పట్టాలెక్కించిన ఈ సంస్థ, ఇప్పుడు అనుపమతో ఈ ఇంటెన్స్ థ్రిల్లర్‌ను అనౌన్స్ చేయడం విశేషం. మే నెలలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్న ఈ సినిమా టైటిల్‌ను త్వరలోనే వెల్లడిస్తామని చిత్ర బృందం తెలిపింది. 'ప్రేమమ్', 'కార్తికేయ 2', 'రాక్షసుడు' వంటి హిట్స్‌తో సౌత్ ఇండియాలో బిజీ హీరోయిన్‌గా మారిన అనుపమ, ఈ సైకలాజికల్ థ్రిల్లర్‌తో తన నటనలో మరో కొత్త కోణాన్ని ఆవిష్కరించబోతోంది. ఇక ఆమె పుట్టినరోజు కానుకగా వచ్చిన ఈ ప్రకటనతో అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు.

## లోక చాప్టర్ 2పై కళ్యాణి ప్రియదర్శన్ క్రేజీ న్యూస్ కళ్యాణి ప్రియదర్శన్



కళ్యాణి ప్రియదర్శన్ నస్లేన్ హీరోహీరోయిన్లుగా నటించారు. 2025 ఆగస్టు 28న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్‌ను షేక్ చేస్తూ నిర్మాతలకు కాసుల వర్షం కురిపించింది. లోక 5 పార్టుల సిరీస్‌గా రాబోతుందని ప్రమోషనల్ ఈవెంట్స్‌లో డొమినిక్ అరుణ్ టీం ఇప్పటికే ఓ వార్తను షేర్ చేసిందని తెలిసిందే.కాగా ఇటీవలే సీక్వెల్ లోక చాప్టర్ 2ను కూడా ప్రకటించేశారు. క్రేజీ సీక్వెల్‌పై ఆసక్తికర వార్తను షేర్ చేసింది కళ్యాణి ప్రియదర్శన్. 'ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ నడుస్తుంది. 2026 సెప్టెంబర్ నుంచి షూటింగ్ మొదలవుతుందని భావిస్తున్నా. అవును నేను కూడా సీక్వెల్‌లో భాగం అవుతున్నా. సినిమా కోసం వెయిట్ చేయండి..'అంటూ చెప్పుకొచ్చింది. కళ్యాణి ప్రియదర్శన్ కామెంట్స్‌తో లోక చాప్టర్ 2పై అభిమానులు, మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేస్తుంది. సీక్వెల్‌కు జేక్స్ బిజోయ్ సంగీతం అందించనున్నాడు.

సెకండ్ పార్ట్‌లో టోవినో థామస్ హీరోగా నటించనుండగా.. డొమినక్ అరుణ్ డైరెక్ట్ చేయబోతున్నాడు. చాప్టర్ 1 బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచిన విషయం తెలిసిందే. మరి రెండో పార్ట్ ఎలాంటి వసూళ్లు రాబడుతుందనేది ఆసక్తికరంగా మారింది.


## నిర్మాతగా నిత్యా మీనన్ కొత్త ప్రయాణం.. అఫీషియల్‌గా ప్రకటించిన పవన్ హీరోయిన్



ప్రముఖ నటి, జాతీయ అవార్డు గ్రహీత నిత్యా మీనన్ తన సినీ ప్రయాణంలో మరో కీలక మైలు రాయిని చేరుకున్నారు. నటిగా ఇప్పటికే విభిన్న పాత్రలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఇప్పుడు నిర్మాతగా కొత్త అవతారం ఎత్తు తున్నారు. 'కేయూరి ప్రొడక్షన్స్' పేరుతో తన సొంత నిర్మాణ సంస్థను ప్రారంభిస్తున్నట్లు సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఓ ప్రత్యేక వీడియోలో తన నిర్మాణ సంస్థ లక్ష్యాలు, దృక్పథం గురించి నిత్యా మీనన్ స్పష్టత ఇచ్చారు. కేవలం వాణిజ్య పరమైన సినిమాలకే పరిమితం కాకుండా, బలమైన కథా నేపథ్యం ఉన్న చిత్రాలు, లోతైన భావోద్వేగాలను కలిగించే పాత్రలు, సమాజంపై ప్రభావం చూపగల కథాంశాలకే తన బ్యానర్ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.సినిమా అనేది కేవలం వినోదం మాత్రమే కాదని, అది ప్రేక్షకులతో ఒక భావోద్వేగ బంధాన్ని ఏర్పరచే శక్తి కలిగిన మాధ్యమమని ఆమె అభిప్రాయపడ్డారు. గత ఏడాది వరుసగా మూడు విభిన్న చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన నిత్యా, ఇప్పుడు నిర్మాతగా కూడా తన ముద్ర వేయాలని సంకల్పించుకున్నారు. ప్రస్తుతం ఈ బ్యానర్ కింద ఎలాంటి ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించకపోయినా, ముందుగా తనకు ఉన్న నటనా కమిట్‌మెంట్‌లను పూర్తి చేయాలనే ఉద్దేశంతో ఉన్నారు. నటిగా కొనసాగుతూనే, అభిరుచి గల నిర్మాతగా కూడా బాధ్యతలు నిర్వహించనున్నారు.విభిన్న కథలను ఎంచుకోవడంలో,ప్రత్యేక స్థానం ఉంది.

## 'ప్రేమాభిషేకం'కు 45 ఏళ్లు.. ప్రత్యేక వీడియో షేర్ చేసిన అన్నపూర్ణ స్టూడియోస్

తెలుగు సినీ చరిత్రలో అద్భుత దృశ్యకావ్యం, నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు కెరీర్‌లో చిరస్థాయిగా నిలిచిపోయిన 'ప్రేమాభిషేకం' చిత్రం విడుదలై నేటికి 45 ఏండ్లు పూర్తి చేసుకుంది. ఈ చారిత్రాత్మక మైలురాయిని పూర్తి చేరుకున్న సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోస్ సోషల్ మీడియా వేదికగా ఒక ప్రత్యేక వీడియోను విడుదల చేసి ఏఎన్ఆర్‌కి ఘనంగా నివాళులు అర్పించింది.దర్శకరత్న దాసరి నారాయణరావు దర్శకత్వంలో, అక్కినేని వెంకట్ మరియు నాగార్జున నిర్మాణంలో 1981 ఫిబ్రవరి 18న విడుదలైన ఈ చిత్రం అప్పట్లో సరికొత్త రికార్డులను సృష్టించింది. ముఖ్యంగా ఎనిమిది కేంద్రాలలో ఏకధాటిగా 365 రోజులకు పైగా ప్రదర్శితమై, తెలుగు చిత్ర పరిశ్రమలో తొలి 'ప్లాటినమ్ జూబ్లీ' చిత్రంగా చరిత్రలో నిలిచిపోయింది. చక్రవర్తి అందించిన స్వరకల్పనలో "వందనం.. అభివందనం", ఉన్నాయి.




Printed, Published & Owned by BATTU LAXMI NARAYANA ; Printed at BATTU PRINTERS, PLOT NO 30 .ROAD NO 2. MADHRA NAGAR. MANSURABAD .LBNAGAR R R DIST., TELANGANA,
Published from BATTU.PUBLICATIONS, H.NO PLOT NO 30 .ROAD NO 2. MADHRA NAGAR. MANSURABAD .LBNAGAR, R R DIST. Editor: BATTU LAXMI NARAYANA, CELL:9951693876